✧˖⋯°*❋ ❋*°⋯˖✧

# శ్రీ లలితా చాలీసా

# Sri Lalita Chalisa
## in **telugu**

✧˖⋯°*❋ ❋*°⋯˖✧

# || శ్రీ లలితా చాలీసా ||

లలితామాతా శంభుప్రియా జగతికి మూలం నీవమ్మా
శ్రీ భువనేశ్వరి అవతారం జగమంతటికీ ఆధారమ్ || 1 ||

హేరంబునికి మాతవుగా హరిహరాదులు సేవింప
చండునిముండుని సంహారం చాముండేశ్వరి అవతారమ్ || 2 ||

పద్మరేకుల కాంతులలో బాలాత్రిపురసుందరిగా
హంసవాహనారూఢిణిగా వేదమాతవై వచ్చితివి || 3 ||

శ్వేతవస్త్రము ధరియించి అక్షరమాలను పట్టుకొని
భక్తిమార్గము చూపితివి జ్ఞానజ్యోతిని నింపితివి || 4 ||

నిత్య అన్నదానేశ్వరిగా కాశీపురమున కొలువుండ
ఆదిబిక్షువై వచ్చాడు సాక్షాదాపరమేశ్వరుడు || 5 ||

కదంబవన సంచారిణిగా కామేశ్వరుని కళత్రముగా
కామితార్ధ ప్రదాయినిగా కంచి కామాక్షివైనావు || 6 ||

శ్రీచక్రరాజ నిలయినిగా శ్రీమత్ త్రిపురసుందరిగా
సిరి సంపదలు ఇవ్వమ్మా శ్రీమహాలక్ష్మిగా రావమ్మా || 7 ||

మణిద్వీపమున కొలువుండి మహాకాళి అవతారములో
మహిషాసురుని చంపితివి ముల్లోకాలను ఏలితివి || 8 ||

పసిడి వెన్నెల కాంతులలో పట్టువస్త్రపుధారణలో
పారిజాతపు మాలలలో పార్వతి దేవిగా వచ్చితివి || 9 ||

రక్తవస్త్రము ధరియించి రణరంగమున ప్రవేశించి
రక్తబీజుని హతమార్చి రమ్యకపర్దినివైనావు || 10 ||

కార్తికేయునికి మాతవుగా కాత్యాయినిగా కరుణించి
కలియుగమంతా కాపాడ కనకదుర్గవై వెలిసితివి || 11 ||

రామలింగేశ్వరు రాణివిగా రవికుల సోముని రమణివిగా
రమా వాణి సేవితగా రాజరాజేశ్వరివైనావు || 12 ||

ఖడ్గం శూలం ధరియించి పాశుపతాస్త్రము చేబూని
శుంభ నిశుంభుల దునుమాడి వచ్చింది శ్రీశ్యామలగా || 13 ||

మహామంత్రాధిదేవతగా లలితాత్రిపురసుందరిగా
దరిద్ర బాధలు తొలిగించి మహదానందము కలిగించే || 14 ||

అర్తత్రాణ పరాయణివే అద్వైతామృత వర్షిణివే
ఆదిశంకర పూజితవే అపర్ణాదేవి రావమ్మా || 15 ||

విష్ణు పాదమున జనియించి గంగావతారము ఎత్తితివి
భాగీరథుడు నిను కొలువ భూలోకానికి వచ్చితివి || 16 ||

ఆశుతోషుని మెప్పించి అర్ధశరీరం దాల్చితివి
ఆదిప్రకృతి రూపిణిగా దర్శనమిచ్చెను జగదంబా || 17 ||

దక్షుని ఇంట జనియించి సతీదేవిగా చాలించి
అష్టాదశ పీఠేశ్వరిగా దర్శనమిచ్చెను జగదంబా || 18 ||

శంఖు చక్రము ధరియించి రాక్షస సంహారమును చేసి
లోకరక్షణ చేసావు భక్తుల మదిలో నిలిచావు || 19 ||

పరాభట్టారిక దేవతగా పరమశాంత స్వరూపిణిగా
చిరునవ్వులను చిందిస్తూ చెఱుకు గడను ధరయించితివి || 20 ||

పంచదశాక్షరి మంత్రాధితగా పరమేశ్వర పరమేశ్వరితో
ప్రమథగణములు కొలువుండ కైలాసంబే పులకించే ॥ 21 ॥

సురులు అసురులు అందరును శిరసును వంచి మ్రొక్కంగా
మాణిక్యాల కాంతులతో నీ పాదములు మెరిసినవి ॥ 22 ॥

మూలాధార చక్రములో యోగినులకు ఆదీశ్వరియై
అంకుశాయుధ ధారిణిగా భాసిల్లెను శ్రీ జగదంబా ॥ 23 ॥

సర్వదేవతల శక్తులచే సత్య స్వరూపిణి రూపొంది
శంఖనాదము చేసితివి సింహవాహినిగా వచ్చితివి ॥ 24 ॥

మహామేరువు నిలయినివి మందార కుసుమ మాలలతో
మునులందరు నిను కొలవంగ మోక్షమార్గము చూపితివి ॥ 25 ॥

చిదంబరేశ్వరి నీ లీల చిద్విలాసమే నీ సృష్టి
చిద్రూపీ పరదేవతగా చిరునవ్వులను చిందించే ॥ 26 ॥

అంబా శాంభవి అవతారం అమృతపానం నీ నామం
అద్భుతమైనది నీ మహిమ అతిసుందరము నీ రూపమ్ ॥ 27 ॥

అమ్మలగన్న అమ్మవుగా ముగ్గురమ్మలకు మూలముగా
జ్ఞానప్రసూనా రావమ్మా జ్ఞానమునందరికివ్వమ్మా ॥ 28 ॥

నిష్ఠతో నిన్నే కొలిచెదము నీ పూజలనే చేసెదము
కష్టములన్నీ కడతేర్చి కనికరముతో మము కాపాడు ॥ 29 ॥

రాక్షస బాధలు పడలేక దేవతలంతా ప్రార్థింప
అభయహస్తము చూపితివి అవతారములు దాల్చితివి ॥ 30 ॥

అరుణారుణపు కాంతులలో అగ్ని వర్ణపు జ్వాలలలో
అసురులనందరి దునుమాడి అపరాజితవై వచ్చితివి ॥ 31 ॥

గిరిరాజునికి పుత్రికగా నందనందుని సోదరిగా
భూలోకానికి వచ్చితివి భక్తుల కోర్కెలు తీర్చితివి ॥ 32 ॥

పరమేశ్వరునికి ప్రియసతిగా జగమంతటికీ మాతవుగా
అందరి సేవలు అందుకొని అంతట నీవే నిండితివి ॥ 33 ॥

కరుణించమ్మా లలితమ్మా కాపాడమ్మా దుర్గమ్మా
దర్శనమియ్యగ రావమ్మా భక్తుల కష్టం తీర్చమ్మా ॥ 34 ॥

ఏ విధముగా నిను కొలిచినను ఏ పేరున నిను పిలిచినను
మాతృహృదయవై దయచూపు కరుణామూర్తిగా కాపాడు ॥ 35 ॥

మల్లెలు మొల్లలు తెచ్చితిమి మనసును నీకే ఇచ్చితిమి
మగువలమంతా చేరితిమి నీ పారాయణ చేసితిమి ॥ 36 ॥

త్రిమాతృరూపా లలితమ్మా సృష్టి స్థితి లయకారిణివి
నీ నామములు ఎన్నెన్నో లెక్కించుట మా తరమవునా ॥ 37 ॥

ఆశ్రితులందరు రారండి అమ్మరూపము చూడండి
అమ్మకు నీరాజనమిచ్చి అమ్మ దీవెన పొందుదము ॥ 38 ॥

సదాచార సంపన్నవుగా సామగాన ప్రియలోలినివి
సదాశివ కుటుంబినివి సౌభాగ్యమిచ్చే దేవతవు ॥ 39 ॥

మంగళగౌరీ రూపమును మనసుల నిండా నింపండి
మహాదేవికి మనమంతా మంగళ హారతులిద్దాము ॥ 40 ॥

✧.......°*❋ ❋*°.......✧

Free download PDF of all types of mantra, stotram,vandana,arati: chalisapdf.net